06052025-DIS-04_Layout 1 5/6/2025 1:38 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అకాల వర్ష బీభత్సం

**అత్యంత** ప్రతికూల పరిస్థితుల్లో పంటలను సాగు చేస్తున్న రాష్ట్ర రైతాంగాన్ని ప్రకృతి కూడా పరీక్షిస్తున్నది. బహుళ సమస్యలతో సతమతమవుతున్న రైతన్నలతో చెడగొట్టు వానలు చెడుగుడాడుతున్నాయి. పంట సాయం, రుణమాఫీ వంటివి ఎండమావులుగా మారిన నేపథ్యంలో పులి మీద పుట్రలా అకాల వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. గాలి వాన బీభత్సానికి చేతికందిన పంట నీటిపాలవుతున్నది. రాష్ట్రంలో వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు వార్తలు వస్తున్నాయి. ఈదురు గాలులతో, వడగండ్లతో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలే కాకుండా తోటలకూ నష్టం వాటిల్లుతున్నది. మామిడి, బొప్పాయి తోటలకు ఎక్కువగా నష్టం జరిగింది. మరోవైపు గొర్రెల పెంపకందారులు పిడుగుల కారణంగా జీవాలను కోల్పోతున్నారు. వ్యవసాయ మంత్రి నెల రోజుల కిందట వెల్లడించిన అంచనాల్లో రెండు దఫాల్లో జరిగిన పంట నష్టాన్ని సుమారు రూ.24 వేల కోట్లుగా ప్రకటించారు. ఆ తర్వాత అకాలవర్షాలు వరుసబెట్టి ఈడ్చి ఈడ్చి కొడుతున్నాయి. ఏప్రిల్ 12వ తేదీ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వడగండ్ల వానలు పడ్డాయి. 18న కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఎండలు, అకాల వర్షాల దాగుడు మూతలు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి.

నాలుగు రోజుల కిందట ఖమ్మం, భూపాలపల్లి జిల్లాల్లో అకాల వర్షాలు మరోసారి తడాఖా చూపించాయి. మొదటి విడత వానలకు పొలాల్లో ఉన్న పంట నష్టమైతే ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కల్లాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం నీటగలిసి పోతున్నది. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటమే అందుకు కారణం. రకరకాల కొర్రీలతో కొనుగోళ్లు జాప్యం అవుతుండటంతో ధాన్యం వర్షార్పణం అవుతుండటంతో రైతులు నిస్సహాయంగా చూస్తుండాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. తాజాగా పంట నష్టాలపై ప్రభుత్వ ప్రకటన ఏదీ వెలువడనప్పటికీ 50-70 వేల ఎకరాల్లో పంట నష్టమైనట్టు అనధికారిక అంచనా. మంత్రి ప్రకటించిన ఎకరా నష్టానికి రూ.10 వేల ప్రభుత్వ సాయం ఏ మూలకూ సరిపోదనేది రైతులు చెప్పాల్సిన పనిలేదు. పైగా అది ఎప్పుడు ఇస్తరో తెలియని పరిస్థితి.

ఇదివరకటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పంట పెట్టుబడితో సమానమైన మొత్తాన్ని సర్కారు పరిహారంగా ఇస్తామనడం విడ్డూరం. మరోవైపు పంటనష్టం అంచనాల్లోనూ అధికారులు అలసత్వం వహిస్తుండటం రైతులకు సమస్యగా మారుతున్నది. సర్వే నత్తనడకన సాగుతున్నది. 33 శాతానికి మించి నష్టం జరిగితేనే సాయం కోసం పరిగణిస్తామనే సర్కారు వారి నిబంధన గుదిబండగా తయారైంది. గోడ దెబ్బ- చెంప దెబ్బ అన్నట్టుగా రెండువైపులా సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు తక్షణ సాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శాస్త్రీయమైన రీతిలో నష్టాన్ని అంచనా వేయడం, పరిహారం పెంచడం, వీలైనంత త్వరలో అందించడం అనేది తప్పనిసరి అని ప్రభుత్వం గుర్తిస్తే మంచిది.

# రైతన్నా, సౌందర్య రాశులన్ జూడుము!

**తెలంగాణ రైతులు ప్రభుత్వం రోజుల తరబడి కొనుగోలు చేయని ధాన్య రాశులను, వర్షానికి మళ్లీ మళ్లీ తడిసిపోతున్న ధాన్య రాశులను చూడలేక దుఃఖిస్తున్నట్టున్నారు. అందుకు బదులు వారు మరికొద్ది రోజులలో తమ రాష్ట్ర రాజధానికి రానున్న ప్రపంచ సౌందర్య రాశులను కనులారా చూసి ఆనందించవలెను. పంటలు పండటం పండకపోవటం, అమ్ముడుకావటం కాకపోవటం, వానలకు తడవటం, తడవకపోవటం, అదంతా చూసి మీరు ఏడ్వటం ఏడ్వకపోవటం, తట్టుకోలేని వారు ఆత్మహత్యలు చేసుకోవటం చేసుకోకపోవటం ఎప్పుడూ ఉన్నదే. కానీ, ప్రపంచం నలుమూలల నుంచి అత్యద్భుతమైన సుందరాంగులు మీ కళ్లెదుటకు వచ్చి విన్యాసాలు చేయటాన్ని ఎన్నడైనా కలలోనైనా ఊహించారా? అందువల్ల ఊరట చెంది పరవశించండి. పంటల భారం ప్రభుత్వంపైగాక దేవునిపై వేయండి.**



టంకశాల అశోక్

ఒకటి కాదు, రెండు కాదు మొత్తం 120 దేశాల అందగత్తెలను ఇంత దూరం రప్పించటం అంతిమంగా మీ మేలు కోసమేనన్న మాట మీకు ఎవరైనా చెప్పారో లేదో తెలియదు. వారంతా హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనటం వల్ల ప్రపంచం దృష్టి అంతా మన నగరంపై పడుతుంది. దానితో ప్రపంచ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున కదలివచ్చి ఇక్కడ పరిశ్రమలు, వ్యాపారాలు నెలకొల్పుతారు. టూరిస్టులు లక్షలకు పెరుగుతారు. మన ఆదాయాలు, ఆర్థిక పరిస్థితి ఆకాశానికి ఎదుగుతాయి. అప్పుడు ఆ ధనరాశులను వినియోగించి మీ ధాన్య రాశులను 'ఒక్క గింజ అయినా మిగలకుండా' ఖరీదు చేసే రోజు తప్పక వస్తుంది. అంతేకాదు, మన రాబడుల స్థాయి ఎంతగా పెరిగిపోతుందంటే, రైతులకు ఎన్నికల సమయంలో మేమిచ్చిన హామీలు ప్రతి ఒక్క దానినీ నూటికి నూరు శాతం మరొక 'నూరు రోజు'ల్లోనే అమలు చేయగలం.

రూ.2 లక్షల వరకు పూర్తి రుణమాఫీ, రైతు భరోసా ఎకరానికి ఏడాదికి రూ.15,000, రైతులతో పాటు కౌలుదారులకు రూ.15,000, భూమిలేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి రూ.12,000, 'అన్ని పంటలనూ మెరుగైన మద్దతు ధరతో' ప్రభుత్వమే కొనుగోలు చేయటం, పంటలు నష్టపోయిన రైతులకు 'తక్షణ నష్ట పరిహారం' అందేట్లు చూడటం, 'పటిష్టమైన పంటల బీమా పథకం', రైతు కూలీలకు, భూమిలేని రైతులకు కూడా రైతు బీమా పథకాన్ని వర్తింపజేయటం మొదలైన ఇంకా అనేక హామీలు గల 'వరంగల్ రైతు డిక్లరేషన్'ను, అందుకు అదనంగా వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ అని ప్రకటించిన కాంగ్రెస్ మేనిఫెస్టోను వెంటనే అమలుకు తెచ్చేందుకు కావలసిన ధనరాశులన్నీ ఈ సౌందర్యరాశుల పోటీతో, దాని వెనువెంట పోటీ పడి రాగల పరిశ్రమలు, వ్యాపారాలతో మనకు





లభించనున్నాయి. ఈ సందర్భంలో మీకు మరొక హామీనివ్వాలి. మా హామీల కింద గత 17 నెలలుగా రైతాంగానికి చాలా బాకీ పడ్డాము. పైకి చెప్పటం లేదుగాని అందుకు ఎంతో చింతిస్తున్నాము. ఇప్పుడు ఈ ఆదాయంతో ఆ బకాయిలన్నీ కూడా ఒకే విడతలో తీర్చి వేయగల శక్తి లభిస్తుంది. మీ కళ్లలో ఆ ఆనందాన్ని చూడాలన్నది మా కోరిక. నమ్ముతారో లేదోగాని అసలు ఈ సౌందర్య పోటీల ఆలోచన చేసి, ఎవరు ఏ విమర్శలు చేసినా పట్టుదలతో నిర్వహిస్తున్నదే అందు కోసం. మీ కోసం, మన తెలంగాణ కోసం, మా ప్రభుత్వం కోసం ఇంతటి సదవకాశాన్ని కల్పిస్తున్న దేశదేశాల అందాల రాశులందరికీ పేరుపేరునా మా కృతజ్ఞతలు.

> **వాస్తవానికి పంటల పరిస్థితి ఇట్లా అవుతున్న రైతులు మాత్రమే కాదు. ప్రభుత్వం మాట తప్పి నీరివ్వక యాసంగి పంటలు ఎండిన రైతులు కూడా , తమ ఎండిన పంటలకు నష్టపరిహారం విషయమై ఇక ఇప్పుడు ఆశలు పెట్టుకోవచ్చు. యాసంగికి ముందు రైతులకు మేమే చెప్పాం, వరి వేసుకోండి అని. మొదట నీరిచ్చి కొన్ని ప్రాంతాలలో మధ్యలో ఆపాం.**

ఆ పొలాలు ఎండుతుంటే రైతులు ఎంత గోస పడుతున్నా నీళ్లు ఇవ్వలేదు సరికదా జవాబు అయినా చెప్పలేదు. పరిహారం అడిగినా మాట్లాడలేదు. అట్లా ఎందుకయిందనే మాటలు ఇప్పుడెందుకు గాని, పరిహారం ఇస్తామని మాత్రం ఇక నమ్మకంగా చెప్తున్నం. అంత నమ్మకం ఎందుకో అర్థమయ్యే ఉంటుంది. వరల్డ్ బ్యూటీస్ అంతా మన హైద్రబాడ్‌కు వస్తున్నారు. ఈ నెల ఎనిమిదో తారీఖు వరకే వచ్చి ఒకటి కాదు , రెండు కాదు మూడు వారాల వరకు ఇక్కడే ఉంటారు. తర్వాత ఇక పరిశ్రమలే పరిశ్రమలు. వ్యాపారాలే వ్యాపారాలు. డబ్బే డబ్బు. అందులోంచి మీకు పరిహారాలే పరిహారాలు. ఈ యాసంగివే కాదు. ముందు ముందు మళ్లా మళ్లా ఎండినా పరిహారాలకు కావలసినంత ఆదాయం వస్తుంది. అయితే మీకొక విజ్ఞప్తి. ఆ జగదేక సౌందర్య రాశులు వచ్చిన తర్వాత రోజులలోనూ రైతులకు అనేక సమస్యలు కొనసాగే అవకాశం ఉండవచ్చు. అయినా యాసంగి ఎండినవారు, పండిన ధాన్యం ఖరీదు కాని వారు, వానలకు తడిసిన వారు ఎవరూ కూడా దయచేసి రోడ్లు ఎక్కొద్దు. ఆందోళనలు చేయొద్దు. ఆ బ్యూటీలను రప్పించటం, పెరేడ్లు చేయించటం అంతా మీ కోసమే గదా. అర్థం చేసుకొని సహకరించండి. వస్తున్న బ్యూటీలను భయపెట్టకండి.

మీకు తెలుసో తెలియదో గాని మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ వంటి కార్యక్రమాలు ప్రపంచంలోని అనేక దేశాలలో ఇప్పటికే జరిగాయి. వాటిలో సెషల్స్, ప్యూర్టో రికో, ఎల్ సాల్వడార్, ఈక్వెడార్, నమీబియా, పెరూ వగైరా వగైరా దేశాలు, నగరాలూ ఎన్నెన్నో ఉన్నాయి. వాటిలో చాలా వాటిపేర్లు కూడా మీరు విని ఉండరు. అయితేనేమి, ఈ అందాల సుందరులంతా అక్కడకు వెళ్లగా అవి అత్యద్భుతంగా అభివృద్ధి చెందాయి. పరిశ్రమలు, వాణిజ్యాలు, ఆదాయాలలో, ముఖ్యంగా అక్కడి రైతులకూ పేదలకూ సహాయాలలో, వారు శాశ్వతంగా బాగుపడటంలో. ఆ తర్వాత నుంచి అవి అగ్రరాజ్యాలకు సమానంగా ఎదిగాయి. అంతెందుకు. లోగడ మన దేశంలోనే బెంగళూరు, బొంబాయిలలో జరిగాయి. ఆ పోటీల వల్లనే ఆ నగరాలు, రాష్ట్రాలు అంత అభివృద్ధి చెందాయి. హైదరాబాద్, తెలంగాణ ఇంత వెనుకబడి ఉండటానికి కారణం అటువంటి పోటీలు ఇంతకాలం జరగకపోవటమేనని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మమ్ములను అడిగితే, దేశంలోని వెనుకబడిన రాష్ట్రాలన్నీ సుందరుల పోటీలు నిర్వహించటాన్ని ఒక విధానంగా మార్చుకోవాలి.

> **ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలుపరిచేందుకు నిధుల కొరత ఇక ఎంతమాత్రం ఉండబోవటంలేదు. ఇందిరమ్మ ఇళ్లు పేదలందరికే గాక, మేము ఇళ్లు కూలగొట్టిన మూసీ వాసులందరికీ నిర్మించి ఇస్తాం. ఆత్మహత్యలు చేసుకున్న రైతులందరి కుటుంబాలకు భారీ పరిహారం చెల్లిస్తాం. తులం బంగారం ధర లక్ష కాదు గదా రెండు లక్షలైనా సరే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద ఇకముందే గాక, గత 17 నెలలో పెండ్లిళ్లు అయిన వారందరికీ ఇస్తాం.**

చనిపోయిన రైతులకు రైతుబీమా, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున బకాయిలూ, కొత్తవీ, ఆడపిల్లలకు స్కూటీలు, చేయూత పింఛన్లు రూ.4,000 చొప్పున, వికలాంగులకు రూ.6,000 లెక్కన, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, ఆటో డ్రైవర్లకు రూ.12,000 చొప్పున, నిరుద్యోగ భృతి నెలకు రూ.4,000, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు (మొదటి సంవత్సరపు బకాయిలు), ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25,000 నెలవారీ పింఛన్, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్, గ్రాడ్యుయేషన్, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయిలలో రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు అందజేయటం, గొర్రెల పెంపకందారులకు నేరుగా రూ. 2 లక్షల చొప్పున చెల్లింపు మొదలైన అనేక ఆర్థికపరమైన హామీలన్నింటికి ఇక నిధులు నిరంతరాయంగా లభించనున్నాయి. అంతేకాదు, సిబ్బందికి డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు, అన్నిరకాల ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాల చెల్లింపులకు ఇక సమస్య ఉండబోదు.

కేవలం ఎన్నికలలో గెలిచేందుకు అలవిగాని హామీలు ఇచ్చి ఇప్పుడు డబ్బు కొరత అని మాట్లాడుతున్న మేము, మీ దృష్టిని మరల్చేందుకు వారానికొక తమాషా చేస్తున్నట్టే, ఇప్పుడు అందచందాల పోటీలతో మీ కళ్లు జిగేల్మనిపింపజేసి తిరిగి దృష్టి మళ్లింపజూస్తున్నామని దయచేసి అపోహపడవద్దు. అది సమంజసమైన అనుమానం కాబోదు. ఎందుకంటే, ఆర్థిక సమస్యలను మొదటనే అంచనా వేసిన మేము వాటిని అధిగమించేందుకు సుందరాంగుల ప్రదర్శనా నిర్వహణ ఒక్కటే మార్గమని అప్పుడే నిర్ణయించుకున్నాము. గత ప్రభుత్వపు అప్పులను ఎత్తి చూపుతూనే అంతకుమించిన అప్పులు చేస్తున్నాము గాని, కోరినన్ని అప్పులు పుట్టడం లేదు. పుట్టబోవన్నది కూడా ముందే తెలుసు. కానీ ఆ మాట ప్రజలకు చెప్పలేము. అటువంటప్పుడు ధీరులు, సమర్థులు, ముందుచూపు గలవారు ప్రజాక్షేమం కోరుకునేవారు చేయవలసింది సమస్యలకు తరుణోపాయాన్ని అన్వేషించటం. సరిగా అటువంటి అన్వేషణా క్రమంలో ఆలోచనలకు ఒక మెరుపు వలె తట్టినటువంటిది మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ.

ఈ కార్యక్రమాలన్నీ వరుసగా మూడు వారాల పాటు అన్ని టెలివిజన్ ఛానళ్లు, యూట్యూబ్‌లు వగైరాలలో తప్పక ప్రసారమవుతాయి. మధ్యలో భారత-పాకిస్థాన్ యుద్ధం వచ్చి ఇందుకు కొంతైనా భంగం కలిగించదరాదని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. యుద్ధం వచ్చినా కొన్ని ప్రసారాలైనా జరుగుతాయి. రైతుల నుంచి మొదలుకొని రాష్ట్ర ప్రజలంతా వాటిని తమతమ కష్టనష్టాలన్నింటిని తాత్కాలికంగా మరిచిపోయి వీక్షించి ఆనందించగలరని కోరుతున్నాను. ప్రత్యేకంగా ఎందుకంటే, ఆ దరిమిలా అనూహ్యమైన అభివృద్ధి జరిగి ప్రస్తుత సమస్యలన్నీ కడతేరనున్నాయి గనుక.

# బడుగుల బంధువు కాదు.. బరువు

**బడుగు, బలహీన వర్గాల పోరాటానికి, ఆకాంక్షలకు కులగుణన రూపంలో పాక్షిక విజయం లభించింది. ఎవరు ఎంతో వారికంత అన్న న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఈ దేశంలోని బహుజనులు దశాబ్దాల నుంచి గళమెత్తుతున్నారు, ఉద్యమిస్తున్నారు. ఏ రాజకీయ ప్రయోజనాల కోసమైతేనేమీ ఎట్టకేలకు కులగణనకు కేంద్రం ఒప్పుకోవడం బీసీలు సాధించిన చరిత్రాత్మక విజయమే. అయితే ఈ గెలుపును తమ ఖాతాలో వేసుకోవడానికి కాంగ్రెస్, బీజేపీలు ఆడుతున్న క్రెడిట్ గేమ్‌ను, పడుతున్న తాపత్రయాన్ని చూస్తుంటే నవ్వొస్తున్నది. అగ్రవర్ణాల ప్రయోజనాలే పరమావధిగా ఉన్న ఈ రెండు జాతీయ పార్టీలకు బహుజనుల పట్ల కొత్తగా పుట్టుకొచ్చిన ప్రేమలోని ఆంతర్యాన్ని, బీసీ హక్కులు, డిమాండ్ల అమలు విషయాల్లో ఆయా పార్టీలు వేసిన రాజకీయ కుప్పిగంతులను బడుగు బలహీన వర్గాలు గుర్తించడం లేదనుకోవడం ఆ రెండు పార్టీల అమాయకత్వానికి నిదర్శనం.**



డాక్టర్ మహేష్ ముదిరాజ్

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి దళిత, గిరిజనులతో పాటు అటుఇటుగా బడుగుల జీవితాలు కూడా పేదరికంలో మగ్గిపోతుండటం, రాజకీయ-ఉద్యోగ అవకాశాలకు ఆమడదూరంలో నిలవడమన్నది జగమెరిగిన సత్యం. కులగణన పేరుతో బడుగుల పట్ల ప్రేమ నటిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఏడున్నర దశాబ్దాల నుంచి దేశాన్ని పాలిస్తున్నాయి. కానీ బడుగుల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ, ఉద్యోగ, విద్యా అవకాశాల కల్పనను ఆ రెండు పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. బీసీల ఆకాంక్షలు, సమస్యల పట్ల ఈ రెండు పార్టీలకు సైద్ధాంతిక అవగాహన, ప్రాతిపదిక లేనే లేవు. దాదాపు 50 ఏండ్ల పాటు మైనారిటీలు, దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్న కాంగ్రెస్, ఆయా సెక్షన్లలో తమ ఆటలు సాగడం లేదని తెలిసిన తర్వాతే, ఇప్పుడు బహుజన వాదాన్ని నెత్తికెత్తుకుని కపట నాటకానికి శ్రీకారం చుట్టింది.

60 ఏండ్ల పాటు బహుజన వాదం గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడకుండా బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచింది. తమ హయాంలో 11 సార్లు జనాభా లెక్కలు తీసినప్పటికీ ఒక్కసారి కూడా కులగణన చేపట్టాలనుకోకపోవడం ఆ పార్టీ సైద్ధాంతిక ఆత్మవంచనకు నిదర్శనం. తమ ప్రభుత్వం కూలిపోయాక వచ్చిన మండల్ కమిషన్, దాని సిఫారసుల అమలుపై 1990 సెప్టెంబర్ 6న లోక్‌సభలో రాజీవ్‌గాంధీ చేసిన ప్రసంగాన్ని ఈ దేశంలోని ఏ బీసీ కూడా కలలో కూడా మరిచిపోడు. మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేసి 27 శాతంబీసీలకు రిజర్వేషన్ ఇస్తే దేశం విచ్ఛిన్నమవుతుంది, కుల యుద్ధాలు వస్తాయన్న రాజీవ్‌గాంధీ వ్యాఖ్యలు బహుజన చరిత్రలో అతిపెద్ద ద్రోహంగా మిగిలిపోతాయి. ఇంతేకాదు కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్లు ఉండాలని రాజీవ్ సూచించారు. రాజీవ్ ప్రసంగం తర్వాతనే ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌లలోని ఓబీసీలు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. అక్కడ కొత్త ఓబీసీ రాజకీయశక్తులు పుట్టుకొచ్చాయి. కులాలవారీగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని మూడున్నర దశాబ్దాల కింద ప్రకటించిన కాంగ్రెస్‌కు రిజర్వేషన్ల అసలు లక్ష్యం, ఉద్దేశం ఇప్పటికీ అర్థం కాలేదు. ఈ రోజు బహుజనుల పట్ల ఎక్కడ లేని ప్రేమను నటిస్తున్న కాంగ్రెస్, 50 ఏండ్ల క్రితమే బీసీలకు తగిన రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే ఈనాడు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేయాల్సిన అవసరం ఉండేది కాదు. కులగణన ప్రకటనను కేంద్ర ప్రభుత్వం చేసిన వెంటనే రాహుల్‌గాంధీ ఒక్కడితోనే ఇది సాధ్యమైందన్న కాంగ్రెస్ వాదనలో ఆవగింజంత నిజం కూడా లేదు. బీజేపీ మత ఎజెండాను ఎదుర్కోవడానికి, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు గతాన్ని మరచిపోయి, బహుజనవాదంతో లభించే ఓట్ల కోసమే రాహుల్‌గాంధీ ఈ డ్రామాలు ఆడుతున్నాడు.



> **రాహుల్‌గాంధీ కులగణన రాగం ఎత్తుకున్న తర్వాత రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఆయా రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టలేదో కర్ణాటకలో పదేండ్ల కిందట జరిగిన కులగణనను ఇప్పటికీ ఎందుకు బయటపెట్టడం లేదో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి.**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేను మోడల్‌గా రాహుల్‌గాంధీ చెప్పడం ఆ పార్టీ సిగ్గులేనితనానికి నిదర్శనం. జనాభాకు అనుగుణంగా అవకాశాల కేటాయింపునే కోరుతున్న బహుజనుల దీర్ఘకాలిక డిమాండ్‌ను తుంగలో తొక్కి, అనుకూల సామాజికవర్గాల సంఖ్యను కృత్రిమంగా పెంచేందుకు సర్వేను వాడుకున్నారు. లక్షలాది మంది బహుజనుల సంఖ్యను తక్కువగా చూపించి జరిగిన అన్యాయాన్ని తెలంగాణ మోడల్‌గా దేశవ్యాప్తంగా ప్రచారం చేయడం విడ్డూరం. 75 ఏండ్లుగా బహుజనుల ఆకాంక్షలను పట్టించుకోకుండా దారుణంగా మోసం చేసినందుకు బీసీలకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి. అప్పుడే కాంగ్రెస్ చేసిన పాపాలకు కొంతైనా ప్రాయశ్చిత్తం కలుగుతుంది.

ఒక వ్యక్తిని, వ్యవస్థను అర్థం చేసుకోవాలంటే వారి చరిత్ర కూడా అధ్యయనం చేయాలి. అప్పుడే వారి నినాదాల వెనుకున్న ప్రయోజనాలు, అజెండాల వెనుకున్న మర్మాలను గుర్తించవచ్చు. కాంగ్రెస్ కొత్తగా ఎత్తుకున్న బహుజన నినాదం పట్ల ఈ దేశ బీసీలు జాగ్రత్తగా ఉండాలి. అట్లనే మోదీ కులగణన అజెండాలోని మర్మాన్ని అర్థం చేసుకోవాలి. మహాత్మా పూలే సినిమా విడుదల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ యంత్రాంగం, వ్యవస్థలు వ్యవహరించిన తీరును చూసిన తర్వాత కులగణన నిర్ణయం, ఆ తర్వాతి ఫలితాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అనేకసార్లు ఆ రెండు పార్టీల చేతిలో మోసపోయిన బీసీ బిడ్డలు తమ నిజమైన మిత్రులు ఎవరో తెలుసుకోవాలి. లేదంటే ఇంకో వందేండ్లు అయినా అగ్రవర్ణ జాతీయ పార్టీల ఎన్నికల అస్త్రాలుగా మాత్రమే బీసీలు మిగిలిపోతారు. తస్మాత్ జాగ్రత్త.. జాగో బహుజన..

**మావోయిస్టుల పేరుతో దేశవ్యాప్తంగా సాగుతున్న ఎన్‌కౌంటర్ హత్యాకాండ పతాకస్థాయికి చేరింది. పట్టుకొని బంధించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని ప్రకటించే ఆనవాయితీ దేశంలో కొనసాగుతున్నది. ఇలా ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయడమనేది ఉమ్మడి ఏపీ భూభాగంలో 1924 నుంచి కొనసాగుతున్నది. 1975 ఎమర్జెన్సీ కాలంలో జలగం వెంగళరావు కొనసాగించిన ఎన్‌కౌంటర్ హత్యాకాండతో శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం పూర్తి అణచివేతకు గురైంది.**

# కగార్‌ను నిలిపివేయాల్సిందే!



ఎన్.నారాయణ రావు



అక్కడినుంచి జగిత్యాల, సిరిసిల్ల జైత్రయాత్రలు అణచివేయడానికి తెలంగాణలోని కొన్ని ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి 127 సాయుధ క్యాంపులతో అణచివేతను కొనసాగించారు. ఆ తర్వాత వచ్చిన పీపుల్స్‌వార్ ఉద్యమంపై చివరికి నల్లమలలో కొనసాగిన ఉద్యమాలపై ఎన్‌కౌంటర్ హత్యాకాండ కొనసాగుతూ ఉద్యమాలను ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోనే ఉనికిలో లేకుండాచేసింది. ఆ క్రమంలోనే 1980ల ప్రాంతంలో దండకారణ్యంలో ప్రవేశించిన పీపుల్స్‌వార్ 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌తో కలిసి మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత జార్ఖండ్, బీహార్, పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో బలమైన ఉద్యమ ప్రాంతాలను నెలకొల్పుకొన్నది. ఆ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం... 185 జిల్లాలలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం ఉన్నదని ప్రభుత్వ లెక్కలే ప్రజల ముందు పెట్టాయి. కానీ 1990ల నుంచి ప్రారంభమైన దండకారణ్యంలోని ఉద్యమ అణచివేత సల్వాజుడుం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్‌లను దాటుకొని నేడు ఆపరేషన్ కగార్‌లో వేలాది బలగాలు చుట్టుముట్టి కాల్చివేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్న అత్యంత కడుహీన స్థితికి ప్రభుత్వాలు దిగజారిపోయాయి.

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ద్వారా ప్రజలకు ప్రాథమిక హక్కులను హామీ పడ్డ ప్రభుత్వాలు ఆచరణలో ఏమీ లేకుండా చేస్తున్నాయి. చివరికి ఆర్టికల్ 21 ప్రసాదించే జీవించే హక్కు కూడా లేకుండా ఎన్‌కౌంటర్ పేరుతో వేటాడుతున్నాయి. ఇప్పటికే రెండున్నర దశాబ్దాల్లో 16 వేలకు పైగా మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో ప్రభుత్వాలు కాల్చిచంపాయి. ఏ ఎన్‌కౌంటర్‌పై కూడా ఏ రాష్ట్రంలో సరైన న్యాయ విచారణ జరుగకుండానే కేసులు మూతబడిపోతున్నాయి. దీనితో ప్రభుత్వాలు యథేచ్ఛగా పోలీసు బలగాలతో కాల్చి చంపించి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నాయి. అందుకు అనేక మిలిటరీ ఆపరేషన్ల పేర్లను సాకుగా వాడుతున్నాయి. కానీ, ఇదే ఎన్‌కౌంటర్ హత్యాకాండకు వ్యతిరేకంగా ఉమ్మడి ఏపీలో 1997లో కన్నాబిరాన్ ఆధ్వర్యంలో న్యాయస్థానంలో పోరాటం ప్రారంభించారు. దాని తీర్పులో భాగంగా 2009, ఫిబ్రవరి 6న భాగంగా ఉమ్మడి ఏపీ విస్తృత ధర్మాసనం ఒక బలమైన తీర్పును వెలువరించింది. అది వెలువడిన 6 నెలల కాలం అంటే ఆ తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చేంత వరకు ఎన్‌కౌంటర్లు జరుగలేదు. ఆ తర్వాత 2014లో పీయూసీఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో 16 గైడ్‌లైన్లతో ఇచ్చిన తీర్పును సుప్రీం కూడా ఖరారు చేసి ఉమ్మడి ఏపీ తీర్పును వెనక్కి నెట్టేసింది. ఈ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలోనే ఎన్టీఆర్ కాలంలో 1989లో ఆ ఏడాదే అత్యంత ఎక్కువగా 275 ఎన్‌కౌంటర్ హత్యలు జరిగాయి. ఆ నేపథ్యంలో తెలంగాణ యువత ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపబడుతున్న స్థితిలోనే రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎస్.ఆర్.శంకరన్ చేసిన దశాబ్దకాల కృషిలో భాగంగానే 2004లో వైఎస్ఆర్ ప్రభుత్వానికి, పీపుల్స్‌వార్ పార్టీకి మధ్య శాంతి చర్చలు జరిగాయి. కానీ, ఆ చర్చల్లో కీలక భూమికను పోషించిన భూమి విషయం వచ్చేసరికి రెండవ దఫా చర్చల్లో పరిష్కరించుకుందామని మొదటి దఫా చర్చలను ముగించారు. రెండవ దఫా చర్చలేమో కానీ మళ్లీ నల్లమల అంతా రక్తం ఏరులై పారి చర్చల వాతావరణమే లేకుండా పోయింది. మొత్తంగా ప్రభుత్వాలు ఎవరినైనా చంపాలనుకుంటే ఎన్‌కౌంటర్ ఆయుధాన్ని చాలా బలంగా ఉపయోగించుకుంటాయి. ఇప్పుడు 2024లో ప్రారంభమైన ఆపరేషన్ కగార్ ఒక ఏడాదిలోనే 350కి పైగా ఆదివాసీల హత్యలు, 45 ఎన్‌కౌంటర్లతో మేధావులను, ప్రజా సంఘాలను, ప్రతిపక్ష పార్టీలను ఆందోళనకు గురిచేయడం గర్హనీయం.

ఈ నేపథ్యంలో మధ్య భారతంలో ఒక బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తున్న మావోయిస్టు పార్టీ కూడా తన పేరుతో ఆదివాసీల నర సంహారాన్ని కొనసాగించడాన్ని చూడలేక, సహించలేక చర్చల ప్రక్రియలో తానే ముందుగా కాల్పుల విరమణ ప్రకటించి నెల రోజులుగా శాంతి కోసం ప్రయత్నిస్తున్నది. కానీ, కేంద్రం ఇప్పటివరకు ఆ శాంతి ప్రక్రియపై స్పందించలేదు. ఈ నేపథ్యంలో 2025, ఏప్రిల్ 27న తెలంగాణలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ స్పష్టంగా ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో చర్చలు కూడా కొనసాగించాలని లక్షలాది జనం ముందు కేసీఆర్ ప్రకటించారు. నిజంగా ఒక ప్రజాస్వామ్య దేశంలో మనుషులను ఎన్‌కౌంటర్ పేరుతో వేటాడి హత్య చేయడమనేది సరైంది కాదు. రాజ్యాంగానికి విరుద్ధం. కార్పొరేట్ల కోసం తన సొంత ప్రజలను శత్రుదేశ ప్రజలుగా చిత్రించి యుద్ధం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ హత్యాకాండను అడ్డుకోవాల్సిందే. ఆ నేపథ్యంలోంచే దేశంలోని బుద్ధిజీవులు ప్రజాస్వామికవాదులు, మేధావులు ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. ఆ వైపుగా ప్రభుత్వం ఆలోచించాలి. లేకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదు.

# మరణమొక నియంత!

ఎగరలేని పిల్లి
శాపనార్థాలు ఎన్ని పెట్టినా
ఉట్టి తెగిపడదు!

మరణం
ఎవరి ఆజ్ఞలు పాటించదు
పసలేని మాటకు విలువ
ఉండదు!

వేలెత్తి చూపేవాడు
శత్రువు ఎన్నటికీ కానే కాడు
అర్థం కాని ఆవేశమే
అనర్థం!

ప్రత్యర్థి
అవకాశమిచ్చినప్పుడే
పుంజుకునే ప్రయత్నం
చేయాలి!

జాగ్రత్త! చుట్టూ చేరిన
వ్యర్థులు
నీ మీసాలు అసందర్భంగా
వాళ్లు మెలివేస్తారు!

సమర్థులకే కదా
సవాళ్లు మొలిచేవి
యుద్ధనీతిని
పాటించకపోతే అపకీర్తే!

మరణం ఎప్పుడూ
అదృష్టశక్తే
అది ఎవరో చెబితే తలుపు
తట్టదు!
చావు ఎప్పుడు
ఎవరి భుజం మీద చెయ్యి
వేసినా
సాక్ష్యానికి సమయం
ఉండదు!

మిత్రమా ఇతరుల మరణం
రాజెప్పుడు కోరరాదు
ఎవరి చావు అంతిమ
పరిష్కారం కాదు!!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

# ఇదేనా మీ జాతీయవాదం?



**పహల్గాం ఉగ్రదాడిలో అమరుడైన నేవీ ఆఫీసర్ వినయ్ సతీమణిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ రావడం దారుణం. ఆ సోషల్ మీడియా అకౌంట్లలో బీజేపీకి సంబంధించిన వ్యక్తులవే ఎక్కువగా ఉన్నాయి. ఆయా అకౌంట్లను ఎందుకు బ్లాక్ చేయడం లేదో కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం చెప్పాలి. ఒక ఆర్మీ ఆఫీసర్ భార్యను ట్రోల్ చేసి కూడా వారు చట్టం నుంచి తప్పించుకుంటున్నారు. ఇదేనా మీ జాతీయవాదం?**

**- సాకేత్ గోఖలే, టీఎంసీ ఎంపీ**